పారదర్శకంగా పథకాలు అమలు చేస్తాం

- ఎమ్మెల్యేలు జీఎంఆర్, అనిరుధ్‌రెడ్డి, శ్రీహరి

కందూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ఊరంచుతండాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

మూసాపేట(అడ్డాకుల), జనవరి 21 : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలంలోని కందూరులో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రేషన్ కార్డుల పంపిణీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల పంపిణీకి అర్హత ఉన్న ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అడ్డాకుల, పెద్దమునగాల్‌చేడ్, సుంకరామయ్యపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

నూతన భవనాల ప్రారంభం..

దేవరకద్ర రూరల్ (చిన్నచింతకుంట), జనవరి 21 : చిన్నచింతకుంట మండలం లాల్‌కోటలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, గ్రామ పంచాయితీ భవనాలను మంగళవారం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు.

తప్పు చేస్తే క్షమించేది లేదు : ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట/బాలానగర్, జనవరి 21 : నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఊరంచుతండాలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు ఎవరైనా తప్పు చేసినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఉమ్మడి బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి, గుండేడు, రంగాపూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అర్హులు 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దుందుభీ వాగుపై పెద్దాయపల్లి, బోడ జానంపేట గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి రూ.10కోట్లు మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు.

అర్హులను ఎంపిక చేయాలి : ఎమ్మెల్యే శ్రీహరి

మక్తల్, జనవరి 21 : అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామసభను మక్తల్ మండలం కర్నిలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. మంతన్‌గౌడ్, భూత్పూర్, కాచ్‌వార్, జక్లేర్ తోపాటు మక్తల్ మున్సిపాలిటీలోని 1,5,10,13వ వార్డుల్లో గ్రామసభ నిర్వహించారు. కాగా, గ్రామసభల్లో అధికారులను పక్కనపెట్టి కాంగ్రెస్ నాయకులు హల్‌చల్ చేశారు. అధికారులు కూర్చోవాల్సిన చోట పార్టీ నేతలు కూర్చొని ప్రజలకు ఇబ్బందులు కలిగించారు. మున్సిపల్ కమిషనర్ భువనేశ్వర్, ఎంపీడీవో రమేశ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ పావని, వైస్ చైర్మన్ అఖిల పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మహబూబ్‌నగర్, నారాయణపేట కలెక్టర్లు విజయేందిర బోయి, సిక్తా పట్నాయక్
- గ్రామ సభల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

లక్ష్మీపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్ర, జనవరి 21 : అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీపల్లిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జాబితాలో అర్హుల పేర్లు లేకుంటే గ్రామసభలో పేర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి వివరించారు. ఇందిరమ్మ ఇండ్లకు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల సర్వే నిర్వహించి జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. గ్రామసభలో విడుదలైన జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి..

మూసాపేట, జనవరి 21 : మండలంలోని చక్రాపూర్‌లో మంగళవారం గ్రామసభను కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. సంక్షేమ పథకాలకు సంబంధించి లిస్టులో పేరు లేదని ఆందోళన చెందవద్దని, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా స్ఫూర్తితండా, దాసరిపల్లి, నందిపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

నర్వ, ఊట్కూరు మండలాల్లో..

ఊట్కూర్, జనవరి 21 : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యంగా గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ బెన్ షాలమ్ అన్నారు. మంగళవారం నర్వ మండలం పెద్దకడ్మూర్‌లో గ్రామసభకు హాజరై ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

జడ్చర్లలో..

జడ్చర్ల, జనవరి 21 : మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. తాసీల్దార్ బ్రహ్మం గౌడ్, హౌసింగ్ డీఈ నర్సింహులు, స్పెషలాఫీసర్ విజయశంకర్, ఏపీవో విజయభాస్కర్ గ్రామసభల్లో పాల్గొన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో అధికారులు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. చైర్‌పర్సన్ పుష్పలత, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కన్వీనర్ ఉమాశంకర్ గౌడ్ జ్యోతి, ప్రశాంత్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్‌లో..

భూత్పూర్, జనవరి 21 : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని ఎంపీడీవో ప్రభాకరాచారి తెలిపారు. మంగవారం శేరిపల్లి(హెచ్), భట్టుపల్లి, పోతులమడుగు, రావులపల్లి, పెద్దతండా, కరివెన గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించినట్లు తెలిపారు.

నారాయణపేట మండలంలో..

నారాయణపేట రూరల్, జనవరి 21 : మండలంలోని సింగారం, కోటకొండ, కొల్లంపల్లి, శేర్నపల్లి, భైరంకొండ గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. భైరంకొండలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి హాజరై మాట్లాడారు.

దామరగిద్ద మండలంలో..

దామరగిద్ద, జనవరి 21 : మండలంలోని కందెన్‌పల్లి, లోకుర్తి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా గ్రామసభను ఎంపీడీవో సాయిలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడలో..

ధన్వాడ, జనవరి 21 : ఉపాధి హామీ పథకంతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని ప్రజలు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ప్రకాశ్ అనే వ్యక్తి అధికారులకు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

జడ్చర్ల : 7వ వార్డులో దరఖాస్తుల పరిశీలన..

వెంకట్‌రెడ్డిపల్లిలో అదనపు కలెక్టర్ మోహన్ రావుతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

అధికారులను నిలదీసిన గ్రామస్తులు

మహ్మదాబాద్, జనవరి 21 : ప్రజాపాలనలో ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందిస్తామని అనర్హులకు ఎంపిక చేయడంపై వెంకట్‌రెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం గ్రామసభకు గ్రామస్తులు అడ్డుకున్నారు. మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లి, కంచన్‌పల్లి, సంగాయిపల్లి, మొకర్లాబాద్, ముందలితండాలో ప్రజాపాలనపై అధికారులు గ్రామసభ నిర్వహించగా, లబ్ధిదారుల ఎంపిక సరిగా లేదంటూ వెంకట్‌రెడ్డిపల్లిలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఉపాధి హామీలో పనిచేయకున్నా ఫీల్డ్ అసిస్టెంట్‌తో హాజరు వేయించుకొని ఆత్మీయ రైతుభరోసా లిస్టులో పేర్లు నమోదు చేసుకున్నారని అదనపు కలెక్టర్ మోహన్ రావు ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. 100మంది లబ్ధిదారులు ఉండగా, 36 మందిని గుర్తించి ఐదుగురికి తల్లిదండ్రుల పేరిట భూమి ఉండడంతో పాటు ఉపాధి హామీలో పనిచేయకున్నా వారిని ఎంపిక చేయడమేటని ప్రశ్నించారు. 60 వరకు భూమి లేకుండా ఉపాధి హామీలో పనిచేసిన వారున్నారని, అలాంటి వారిని కాకుండా అర్హత లేని వారిని ఎలా ఎంపిక చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అడిషనల్ కలెక్టర్ కల్పించుకొని అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పథకాల అమలు నిరంతర ప్రక్రియ

నారాయణపేట టౌన్, జనవరి 21 : ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అర్హులైన వారందరికీ అందిస్తామని, నిరంతర ప్రక్రియగా చేపడుతామని కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి అన్నారు. పట్టణంలోని 7వ వార్డు ఆశోక్‌నగర్‌లో ప్రజాపాలన సభను కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, దరఖాస్తు చేసుకోని వారు నాలుగు రోజులపాటు నిర్వహించే సభలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. భూమిలేని పేదలకు రూ.12వేల ఆర్థికసాయం అందిస్తారన్నారు. వార్డు పరిధిలో పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ జాబితాలో పేర్లు లేకపోయినా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే తన సొంత నిధులతో కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఫర్నిచర్‌ను పరిశీలించారు. అదేవిధంగా 5వ వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సునీత, కౌన్సిలర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండలంలో..

మద్దూర్ (కొత్తపల్లి), జనవరి 21 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కొత్తపల్లి మండలంలోని దుప్పటి గట్టులో గ్రామసభను పరిశీలించారు. లబ్ధిదారుల జాబితాను ఆర్డీవో చదివి వినిపించారు. జాబితాలో పేరు రాలేదని ఆందోళన చెందవద్దని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఆర్టిజన్స్‌ను వెంటనే కన్వర్షన్ చేయాలి

రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టిజన్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, జనవరి 21 : ఆర్టిజన్స్‌ను వెంటనే కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ -జేఏసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ ఎస్ఈ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయడం వల్ల విద్యుత్ సంస్థలపై పెద్దగా ఆర్థిక భారం పడదన్నారు. విద్యార్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలన్నారు. ఫిబ్రవరి 3 నుంచి 13 వరకు కన్వర్షన్ యాత్ర, 20వ తేదీన హైదరాబాద్‌లో చలో విద్యుత్ సౌధ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షలో జిల్లా కన్వీనర్ రాములు, కార్మికులు గంగాధర్, రాఘవేందర్, ధర్మా, తిరుమలేష్, నాగభూషణ్, శివన్న, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాటమారిస్తే గుణపాఠం చెబుతాం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 21 : కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే ఆశావర్కర్స్‌కు నెలకు రూ.18వేలు వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తెలంగాణ హెల్త్ కమిటీ, ఆశవర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి అక్కడే నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏవో శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా కురుమూర్తి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆశవర్కర్లకు రూ.18వేల వేతనం తోపాటు అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నేడు నెరవేర్చకుండా మాటమార్చడం సరికాదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ప్రమోషన్స్ తోపాటు రూ.50లక్షు ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు, అంత్యక్రియల ఖర్చు రూ.50వేలు తక్షణమే చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.

కార్యక్రమంలో సీఐటీయూ టౌన్ కన్వీనర్ రాజ్‌కుమార్, కోశాధికారి చంద్రకాంత్, ఆశకార్యకర్తల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు సావిత్రితోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఆశలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి..

నారాయణపేట టౌన్, జనవరి 21 : ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములుడ్డి, జిల్లా కార్యదర్శి బాల్‌రాం, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలామణి డిమాండ్ చేశారు. మంగళవారం ఆశ కార్యకర్తలు మండలంలోని అప్పక్‌పల్లి నుంచి పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం వరకు దాదాపు 10కిలో మీటర్లు మహాపాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం నిరసన చేపట్టి ఏవో జయసుధకు వినతిపత్రం పత్రం అందజేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

దామరగిద్ద, జనవరి 21 : మండల కేంద్రంలో పటేల్ బసంత్‌రాజ్ నివాసంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుభాశ్ అధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాశ్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ కిషన్‌రావు, వెంకట్‌రెడ్డి, నాయకులు చంద్రకాంత్, సోషల్ మీడియా కన్వీనర్ అంజి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చట్టాలపై అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

హన్వాడ, జనవరి 21 : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్పందన, సీనియర్ న్యాయవాది రవికుమార్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాములు, పారా లీగల్ వలంటీర్లు యాదయ్య, నాగభూషణ్, శివన్న, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి ఇందిర

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి

మరికల్, జనవరి 21 : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నారాయణపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సౌభాగ్యలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కిరీటి, సిబ్బంది అరవింద్, బస్వరాజ్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

నారాయణపేట టౌన్, జనవరి 21 : 40ఏండ్ల నుంచి చిన్నారులకు వివిధ కళాంశాలలో శిక్షణ ఇస్తున్న బాలకేంద్రాన్ని బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్ డిమాండ్ కోరారు. మంగళవారం బాల కేంద్రం సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే పర్ణికా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది నర్సింహులు, వసంత్, జ్ఞానామృత తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ, ఖోఖో పోటీలు

దామరగిద్ద, జనవరి 21 : మండంలోని క్యాతన్‌పల్లి పాఠశాలలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కానుకుర్తి, దామరగిద్ద, మొగల్‌మడ్క గ్రామాల పాఠశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం గెలిచిన జట్టు సభ్యులకు మండల విద్యాధికారి కృష్ణారెడ్డి బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ కోఆర్డినేటర్ నాగమ్మ, పద్మ, వలంటీర్ నరేశ్, కృష్ణయ్య, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లల గుర్తింపు

మరికల్/ధన్వాడ, జనవరి 21 : మండలంలోని కన్మనూర్‌లో మంగళవారం సీఆర్‌పీ శివకుమార్, ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి బడిబయటి పిల్లలను గుర్తించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ధన్వాడ మండలం కొండ్రోనిపల్లిలో సీఆర్‌పీ వెంకట్రాములు ఆధ్వర్యంలో బడిఈడు పిల్లల సర్వేను చేపట్టారు.

పాలమూరు యూనివర్సిటీలో కొత్తకోర్సులు

యూనివర్సిటీల వీసీలతో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ తదితరులు

- వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 21 : రానున్న విద్యా సంవత్సరంలో పాలమూరు యూనివర్సిటీలో కొత్తకోర్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వీయూ వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారానాను మంగళవారం పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ఆచార్య డి.చెన్నప్ప హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీలో మౌళిక సదుపాయాలు, ఉద్యోగుల నియామకం, కొత్త కోర్సుల రూపకల్పన తదితర అంశాలపై చర్చించారు. మౌళిక సదుపాయాల కల్పనకు సహకరించాలని కోరారు. అంతకుముందు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారానా, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, విద్యామండలి అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్లతో భేటీ అయ్యారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలి

- ఎస్పీ యోగేశ్ గౌతమ్

విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ యోగేశ్ గౌతమ్

నారాయణపేట టౌన్, జనవరి 21 : అబాకస్, వేదిక్ మ్యాథ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ విద్యార్థులకు సూచించారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జోనల్ స్థాయి పోటీల్లో పట్టణంలోని సన్‌షైన్ స్కూల్ విద్యార్థులు శశివేదాంత్, అభిలాష్, జరార్ పాల్గొని ప్రథమ బహుమతులు సాధించారు. మంగళవారం పేట ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేశ్ గౌతమ్ మర్యాద పూర్వకంగా కలువగా, వారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అభిలాష్, ప్రిన్సిపాల్ సాధన తదితరులు పాల్గొన్నారు.

మల్టీలెవల్ స్కీంలపై అప్రమత్తంగా ఉండాలి..

ప్రజలు మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీంపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ సూచించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజల సొమ్ము దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త పోకడలతో, ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకునేందుకు కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారని తెలిపారు. ఎవరైనా ఈ స్కీంల ద్వారా మోసపోయినట్లయితే తక్షణమే 1930 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలి

అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

- డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 21 : పరీక్షలంటే భయపడొద్దని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అన్న పూర్ణ గార్డెన్‌లో జిల్లా విద్యాశాఖ, డ్రీమ్‌ఫోర్స్ ఫౌండేషన్ ఏపీజే అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థుల ప్రేరణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. ఉపాధ్యాయులతో సందేహాలను నివృత్తి చేసుకొని ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ప్రధాన వక్తగా వాగ్దేవి విద్యాసంస్థల అధినేత విజేత వెంకట్‌రెడ్డి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రముఖ సైకాలజిస్టు శ్రీనివాస్, కలాం ల్యాబ్ అధ్యక్షులు జనార్ధన్, సీఎంవో బాలుయాదవ్, దుంకుడు శ్రీనివాస్, విషయ నిపుణులు సత్యం, ఖాలీద్, మోహన్‌రెడ్డి, మంజులత, గుముడాల చక్రవర్తిగౌడ్ తదితరులు పదో తరగతి వార్షిక పరీక్షల ప్రశ్నాపత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలాం ల్యాబ్ వ్యవస్థాపకుడు టీఎన్ శ్రీధర్, గౌరవ సలహాదారు రవీందర్‌గౌడ్, కరుణాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పల్లాటి, కోశాధికారి నర్సప్ప, సభ్యులు రమాదేవి, పద్మజ, రిటైర్డ్ టీచర్ వెంకటేశ్వర్లు, జీహెచ్ఎం రామన్ గౌడ్, వందేమాతరం జిల్లా కోఆర్డినేటర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఊట్కూర్, జనవరి 21 : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి నాగార్జున రెడ్డి అన్నారు. రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్‌లో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులతో సోహమ్ అకాడమీ వారు ఎలక్ట్రానిక్ పరికరాల కృత్యాలను తయారు చేయించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు శాస్త్ర పరిజ్ఞానంతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం మురళీధర్, సెక్టోరల్ అధికారి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాజాపూర్‌లో రోబోటిక్ శిక్షణ

ఎలక్ట్రానిక్ పరికాల ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

నారాయణపేట రూరల్, జనవరి 21 : మండలంలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రోబోటిక్ శిక్షణ నిర్వహించారు. సోహం అకాడమీ ఆధ్వర్యంలో ఒకే రోజు 7 విద్యాసంస్థల్లో శిక్షణను నిర్వహించడం జరిగిందన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తికి జైలుశిక్ష

నారాయణపేట టౌన్, జనవరి 21 : ఈనెల 19న జిల్లా కేంద్రంలో పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలో కర్ణాటక రాష్ట్రం పరమేశ్‌పల్లికి చెందిన వెంకటేశ్ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడగా, మంగళవారం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై వెంకట్రేశ్వర్లు తెలిపారు. కోర్టు